క్లుప్తంగా

బస్‌షెల్టర్ కోసం వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రజాప్రతినిధులు

రాజవొమ్మంగి: మండల కేంద్రంలో బస్‌షెల్టర్ ఏర్పాటుచేయాలని కోరుతూ కొండపల్లి, చికిలింత సర్పంచ్‌లు జగన్నాథం, సూరిబాబు, సీఐటీయూ నాయకుడు రామరాజు తదితరులు తహసీల్దార్ సత్యనారాయణను కలిసి వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలో బస్‌షెల్టర్ లేకపోవడంతో ఆరుబయటే ప్రయాణికులు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందని, తాగునీరు, మరుగుదొడ్లు తదితర సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వినతిలో పేర్కొన్నారు. దీనిపై తహసీల్దార్ స్పందించి సమస్యను సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారని వారు చెప్పారు.

వర్మీకంపోస్టు యూనిట్‌లను వినియోగంలోకి తీసుకురావాలి



సూచనలిస్తున్న ఎంపీడీవో ప్రసాద్

కొయ్యూరు: చెత్త నుంచి సంపద కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావాలని ఎంపీడీవో ప్రసాద్ చెప్పారు. మండలంలోని రేవళ్లు, మంప పంచాయతీల్లోని చెత్త సంపద తయారీ కేంద్రాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో వర్మీకంపోస్టు యార్డులను తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని, పాడైన వాటికి మరమ్మతు పనులు చేయించాలని ఆదేశించారు.వాటికి అవసరమైన చర్యలు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. చెత్తను రోడ్డుపై వేయకుండా చూడాలన్నారు. తడి, పొడి చెత్తలను వేర్వేరుగా చేయించాలని సూచించారు.

నేడు ఉన్నతాధికారుల పర్యటన

అనంతగిరి(అరకులోయటౌన్): మండలంలోని సచివాలయాల్లో శనివారం జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులు పర్యటించనున్నట్టు ఎంపీడీవో ఎ.వి.వి.కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది హాజరు పట్టిక, మూమెంట్, స్పందన, వాటర్ ట్యాంక్‌ల క్లీనింగ్, విజిటింగ్ రిజిస్టర్‌లలో వివరాలు పూర్తిగా ఉండేలా చూడాలన్నారు. పంచాయతీల పరిధిలో జరిగే అన్ని అభివృద్ధి, సంక్షేమ పనులకు సంబంధించిన వివరాలు సిద్ధం చేయాలన్నారు. సచివాలయ సిబ్బందికి ఆన్‌లైన్ విధానంలో బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి చేశారని, ప్రతీ ఒక్కరూ విధిగా ఉదయం, సాయంత్రం హాజరు వేసుకోసుకోవాలని లేని పక్షంలో శాఖ పరమైన చర్యలు తప్పవన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఫీల్డ్ విజిట్ ఉండి, అనంతరం సాయంత్రం 5 గంటల వరకు సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాలు ప్రతి ఒక్కరూ పాటించాలని ఎంపీడీవో కుమార్ ఆదేశించారు.

ఏకలవ్య ప్రవేశ పరీక్షకు 551 మంది విద్యార్థులు

అడ్డతీగల: ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌లోని ఆరవ తరగతిలో ప్రవేశాలకుగాను మార్చి 2న నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు 551 మంది విద్యార్థులు హాజరుకానున్నట్టు స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె.హరినాథబాబు తెలిపారు. అడ్డతీగల, వై.రామవరం మండలాలకు చెందిన విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవుతున్నట్టు పేర్కొన్నారు. పరీక్ష నిర్వహణ కోసం 23 రూములు కేటాయించామన్నారు. ఒక్కో గదికి 24 మంది విద్యార్థుల చొప్పున పరీక్ష రాయడానికి ఏర్పాట్లు చేశామన్నారు. 23 మంది ఇన్విజిలేటర్లు ,ఒక చీఫ్ సూపరింటెండెంట్, మరొకరు అసిస్టెంట్ చీఫ్ సూపరింటెండెంట్, ఒక డీవో, ఒక అబ్జర్వర్ పరీక్షలను పర్యవేక్షిస్తారని చెప్పారు.

పేదలకు రగ్గుల పంపిణీ



పేదలకు రగ్గులను పంపిణీ చేస్తున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులు

పాడేరు : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు మండలంలోని కాడెలి పంచాయతీ తోటగున్నలు, సావిడిమామిడి, కప్పలయ్య, కాడెలి, వర్తనపల్లి గ్రామాల్లో సుమారు 150 మంది పేదలకు రగ్గులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్మన్ సొనాయి గంగరాజు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామన్నారు. సొసైటీ ద్వారా నిర్వహించే రక్తదాన శిబిరాల్లో ప్రతి ఒక్కరు మానవత్వంలో ఆలోచించి రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కో-ఆర్డినేటర్ లోహితాస్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలపై
అవగాహన అవసరం

- వాడవాడలా ఘనంగా సైన్స్ డే
- డాక్టర్ సి.వి.రామన్‌కు ఘన నివాళి
- ఆకట్టుకున్న ప్రాజెక్టుల ప్రదర్శనలు
- విద్యార్థులకు బహుమతులు





అరకులోయ డిగ్రీ కాలేజీ, ముంచంగిపుట్టు పాఠశాలల్లో సి.వి.రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైస్ ప్రిన్సిపాల్ పుష్పరాజ్, విద్యార్థులు తదితరులు



జడ్డంగి జెడ్పీ హైస్కూల్‌లో ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



డౌనూరు పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు



చింతపల్లిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ విజయ భారతి



రంపచోడవరంలో ప్రాజెక్టుల ప్రదర్శన

అరకులోయటౌన్: జిల్లా వ్యాప్తంగా జాతీయ సైన్స్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యాలయాల్లో విద్యార్థులు రూపొందించిన సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాళ్లు, హెచ్ఎంలు, మేధావులు తదితరులు మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. సైన్స్‌తోనే మానవ మనుగడ కొనసాగుతుందన్నారు. ప్రపంచ సైన్స్ మేధావి డాక్టర్ సీవీ రామన్ కాంతి సిద్ధాంతాన్ని ఆవిష్కరించిన దినోత్సవాన్ని సైన్స్ డేగా నిర్వహిస్తారన్నారు. విద్యార్థి దశ నుంచి శాస్త్రవేత్తలుగా ఎదిగేందుకు లక్ష్యంగా నిర్ణయించుకోవాలన్నారు. సైన్స్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్‌కుమార్ నాయక్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పుష్పరాజ్, అధ్యాపకులు కొండబాబు, కృష్ణామోహన్, భవాని, సోంబాబు, రాజు, నాగబాబు, లచ్చన్న, దొన్ను, అప్పారావు, సునీల్ కుమార్, ఎన్ఎస్ఎస్ పీవోలు విజయలక్ష్మీ, అనితకుమారి తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలో నిర్వహించిన కార్యక్రమాల్లో హెచ్ఎంలు లక్ష్మీ, మాణిక్యాలరావు, ప్రకాశం, ప్రిన్సిపాల్ మత్స్యరాజు పాల్గొన్నారు.

కొయ్యూరు: డౌనూరు ఆశ్రమ పాఠశాలలో జరిగిన వేడుకలో హెచ్ఎం ప్రభుదాస్, ఉపాధ్యాయులు జె.బెనర్జీ, కె.అప్పారావు పాల్గొన్నారు.

చింతపల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన వేడుకలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి, అధ్యాపకులు రవీంద్ర నాయక్, బి.వి.రమణ, లీలాపావని, జగదీష్ పాల్గొన్నారు.

రంపచోడవరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ శిక్షణ కళాశాల (డీఎడ్ కాలేజీ)లో జరిగిన వేడుకలో ప్రిన్సిపాల్ ఎం.చినబాబు సైన్స్ డే గురించి విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి, బహుమతులు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ సూర్యనారాయణ, అధ్యాపకులు అపర్ణ, భాస్కరరావు, వెంకటలక్ష్మి, బాపిరాజు, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు. రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వసుధ తదితరులు పాల్గొన్నారు.

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి పరిషత్ ఉన్నత పాఠశాల, బొర్నగూడెం ఆశ్రమోన్నత పాఠశాలల్లో జరిగిన వేడుకల్లో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. హెచ్ఎం రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి: మరొకరికి గాయాలు



మృతుడు సోమ్‌నాథ్

దుంబ్రిగుడ: మండలంలోని అరకు- పాడేరు జాతీయ రహదారిలో నేరేడువలస గ్రామ సమీపంలో వంతెన వద్ద డివైడర్‌ను ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్ర గాయాలతో అరకులోయ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ పాపినాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విశాఖపట్నం పోర్టు కాలనీకి చెందిన రామ్మోహన్ , సోమ్‌నాథ్‌లు ఫోటో షూట్ నిమిత్తం స్కూటీపై అరకులోయ నుంచి చాపరాయి వెళ్తుండగా కురిడి సమీపంలోని నేరుడువలస గ్రామం వద్ద డివైడర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో సోమనాథ్ అక్కడికక్కడే మృతి చెందగా, తీవ్ర గాయాలైన రామ్మోహన్‌ను స్థానికులు 108లో అరకులోయ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పాపినాయుడు తెలిపారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న విశాఖపట్నం జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

జి.మాడుగుల: మండల పరిషత్ కార్యాలయాల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా పరిషత్ సీఈవో పి. నారాయణమూర్తి తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంలో జి.మాడుగుల మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ నిధులు(జెడ్పీ నిధులు)లతో చేపట్టిన అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు.ముందుగా సాడేకు గ్రామంలో సచివాలయాన్ని సందర్శించారు. ఎంఎస్ఎంఈ తదితర సర్వేలపై ఆయన సమీక్ష జరిపారు. జి.మాడుగులలో గల జిల్లా పరిషత్ అతిథి గృహం మరమ్మతుల పనులు జి.ఎం. కొత్తూరు గ్రామంలో వాటర్ ట్యాంకు ఆయన పరిశీలించారు. అతిథి గృహం అభివృద్ధికి తగిన సూచనలు చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన సందర్శించి కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. సీఈవోకు మండల పరిషత్ కార్యాలయం అధికారితో పాటు సిబ్బంది, ప్రజాప్రతినిధులు దుశ్శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ వంతాల కల్యాణి,ఎంపీడీవో తేజ్‌రతన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్‌కుమార్,పీఆర్ ఏఈ మాణిక్యం,ఈవోఆర్‌డీ డేవిడ్, పంచాయతీ కార్యదర్శిలు పాల్గొన్నారు.

పశువ్యాధి నియంత్రణ పథకం పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను విడుదల చేస్తున్న ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ

పాడేరు : జాతీయ పశువ్యాధి నియంత్రణ కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో, జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ తెలిపారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం పోస్టర్లను శుక్రవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్చి ఒకటో తేదీ నుంచి 30 వరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పశువులకు గాలికుంటు, బ్రూసెల్లోసిస్ వ్యాధుల నిరోధక టీకాలను ఉచితంగా వేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్థక అధికారి డాక్టర్ నర్సింహులు, పశువైద్యాధికారి డాక్టర్ రాజీవ్‌కిశోర్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం



ముంచంగిపుట్టులోని సెంటర్‌లో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ప్రిన్సిపాల్ కొండన్నదొర


ముంచంగిపుట్టు: ఇంటర్ పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా అన్ని చోట్ల ఏర్పాట్లు పూర్తి చేసినట్టు అధికారులు తెలిపారు. ముంచంగిపుట్టు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లను ప్రిన్సిపాల్ కొండన్నదొర శుక్రవారం పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి పరీక్ష గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ఫస్ట్ ఇయర్‌లో 288 మంది, ద్వితీయ సంవత్సరంలో 260 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్టు తెలిపారు. పరీక్ష కేంద్రంలో తాగునీరు, ఫ్యాన్లు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలు కల్పించామన్నారు.

పెదబయలు: ఏపీ గురుకుల రెసిడెన్షియల్ కళాశాలలో ఏర్పాట్లను ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య, తహసీల్దార్ జి.రంగారావు, ఎంఈవో కె.కృష్ణమూర్తి పరిశీలించారు. ప్రిన్సిపాల్ పి.ఈశ్వరమ్మ మాట్లాడుతూ 277 మంది విద్యార్థులు ఫస్ట్ ఇయర్ పరీక్ష రాయనున్నట్టు ప్రిన్సిపాల్ పి.ఈశ్వరమ్మ తెలిపారు.

అడ్డతీగల: అడ్డతీగల ఎస్‌పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాట్లను ప్రిన్సిపాల్ నున్నం రాజేంద్రస్వామి పరిశీలించారు. ఫస్ట్ ఇయర్ పరీక్షకు 312 మంది విద్యార్థులు హాజరు కానున్నట్టు తెలిపారు. గురుకుల జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరం 94 మంది, ద్వితీయ సంవత్సరం 84 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్టు ప్రిన్సిపాల్ ఆంజనేయులు తెలిపారు.

మారేడుమిల్లి: స్థానిక గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షల ఏర్పాట్లను ఎంపీడీవో తూతిక శ్రీనివాస విశ్వనాథ్, తహసీల్దార్ బాలాజీ శుక్రవారం పరిశీలించారు. ప్రిన్సిపాల్ జి.సత్యనారాయణ, కార్యదర్శి సోమేశ్వరరావు పాల్గొన్నారు.

250 కిలోల గంజాయి స్వాధీనం



జి.మాడుగులలో పట్టుబడిన గంజాయి, ఆటో, నిందితుడితో పోలీసులు

జి.మాడుగుల: ఉరుము జంక్షన్ వద్ద శుక్రవారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తుండగా ఉబ్బాసింగి పంచాయతీ సంగులోయ గ్రామానికి చెందిన కొండపల్లి పిన్నయ్య, మరో వ్యక్తి ఆటోలో 250 కిలోల గంజాయిని మైదాన ప్రాంతాలకు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ షణ్ముఖరావు తెలిపారు. పిన్నయ్యను అదుపులోనికి తీసుకోగా మరొకరు పరారైనట్టు ఆయన తెలిపారు. సీఐ శ్రీనివాస్ రావు ఆదేశాల మేరకు గంజాయిని, ఆటో, గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితుడు పిన్నయ్యపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ షణ్ముఖరావు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.12,50,000 ఉంటుందని ఆయన తెలిపారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో లక్ష్మణరావు

గంగవరం: పదో తరగతిలో నూరుశాతం ఫలితాలు సాధనకు కృషి చేయాలని ఎంపీడీవో వై.లక్ష్మణరావు అన్నారు. మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు, వంద రోజుల ప్రణాళిక అమలుతీరుపై ఆరా తీశారు. ఉపాధ్యాయులకు పలు సూచనలిచ్చారు. పాఠశాలలో సైన్స్ డేను పరిశీలించారు. హెచ్ఎం వరలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

చింతపల్లి: చింతపల్లి డిగ్రీ కళాశాలలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి ఒక ప్రకటనలో తెలిపారు. శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ శిబిరంలో కంటికి సంబంధించిన అన్ని పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. దీంతో పాటు అవసరమైన వారిని విశాఖపట్నం తరలించి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయనున్నట్టు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని కంటి రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భారీ అన్నసమారాధన

రాజవొమ్మంగి: శివరాత్రి మహోత్సవాల్లో భాగంగా జడ్డంగి అటవీ ప్రాంతంలోని కొండ గుహలో స్వయంభూగా వెలసిన భ్రమరాంబికా మల్లికార్జున స్వామి వారి ఆలయం వద్ద శుక్రవారం అన్నదాన కార్యక్రమం జరిగింది. వేలాదిగా భక్తులు వచ్చి ప్రసాదాలు స్వీకరించినట్టు సర్పంచ్ మురళీకృష్ణ, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అన్న సమారాధనకు ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు విరాళం అందజేసినట్టు తెలిపారు.

కొనసాగుతున్న భూదాతల దీక్షలు

దుంబ్రిగుడ: మండలంలోని ఏకలవ్య పాఠశాల భూ దాతల దీక్ష శుక్రవారం నాటికి 36వ రోజుకు చేరుకున్నాయి. జనవరి నుంచి చేపట్టిన దీక్ష నేటి వరకు కొనసాగుతుంది. ఇప్పటి వరకు అధికారులు స్పందించక పోవడం దారుణమని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని, ఏకలవ్య పాఠశాల కోసం భూదానం చేసిన తమ కుటుంబాలకు నాడు ఐటీడీఏ ఉన్నతాధికారులు ఇచ్చిన హామీ మేరకు ఉపాధి కల్పించి న్యాయం చేయాలని కోరారు. డొంబు, రాంచందర్, రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి



మాస్టర్ ట్రైనర్ నుకుంజ్ బిహారీని సన్మానిస్తున్న ఐటీడీఏ పీవో సింహాచలం

- ఏజెన్సీలో కొబ్బరితోటల అభివృద్ధికి కృషి
- రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

రంపచోడవరం: ఏజెన్సీలో కొబ్బరి తోటలు అభివృద్ధి కృషి చేస్తామని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. పందిరిమామిడి ఉద్యాన పరిశోధన స్థానంలో గిరిజన యువతకు కొబ్బరి చిప్పలతో కళాకృతులు తయారీ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవో సింహాచలం మాట్లాడుతూ ఏజెన్సీలో ఏటా 30 వేల కొబ్బరి మొక్కలు నాటేందుకు చర్యలు చేపడతామన్నారు. కొబ్బరి చిప్పలతో కళాకృతుల తయారీపై ఐటీడీఏ ద్వారా శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు.

గిరిజన యువత కొబ్బరి చిప్పలతో తయారు చేసిన వివిధ రకాల వస్తువుల, కళాకృతులను ఆయన పరిశీలించారు. ఉద్యాన పరిశోధన స్థానం అధిపతి డాక్టర్ డాక్టర్ పీసీ వెంగయ్యను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పొందిన వారికి 13 రకాల వస్తువులతో ఉన్న కిట్‌లను పంపిణీ చేశామన్నారు. తయారుచేసిన వస్తువుల మార్కెటింగ్‌కు ఈ-కామర్స్ ద్వారా సహకారమందిస్తామన్నారు. కళాకృతుల తయారీపై జాతీయ అవార్డు పొందిన నుకుంజ్ బిహారీ యువతకు శిక్షణ ఇచ్చారు.

మాజీ ఎమ్మెల్యే పాల్గుణ జన్మదిన వేడుకలు



చాపరాయి వద్ద జరిగిన వేడుకలో నేతలతో కలిసి కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

దుంబ్రిగుడ/ముంచంగిపుట్టు/హుకుంపేట: అరకులోయ మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ జన్మదిన వేడుకలను దుంబ్రిగుడ, ముంచంగిపుట్టు, హుకుంపేట మండలాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అరకులోయలో మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, ఎంపీటీసీ రామారావు, పోతంగి సర్పంచ్ వెంకటరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గాసి, నాయకులు గోపాల్, శ్రీరాములు, రామునాయుడు, ముంచంగిపుట్టులో జరిగిన వేడుకలో వైఎస్సార్‌సీపీ నాయకులు సీహెచ్‌సీలో రోగులకు రొట్టెలు, పాలు అందజేశారు. మండల పార్టీ అధ్యక్షుడు పద్మారావు, సర్పంచ్‌లు రమేష్, నరసింగరావు, నాయకులు సన్యాసిరావు, రాజా రావు, పులిరాజు, తిరుపతి, దాసు, దేవ తదితరులు పాల్గొన్నారు. హుకుంపేటలో జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గండేరు చినసత్యం, నాయకులు కొండబాబు, రామకృష్ణ, చిన్నబ్బి, ధర్మయ్యదొర, మహేష్, మురళి, పద్మారావు, జైరాం, రాజారావు, వెంకట్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

టైలర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



ఎటపాకలోని కార్యక్రమంలో పాల్గొన్న టైలర్లు



రంపచోడవరంలోని సీనియర్ టైలర్‌ను సన్మానిస్తున్న దర్జీలు

రంపచోడవరం: మండలంలోని జాగరంపల్లిలో శుక్రవారం టైలర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్య ప్రాథమిక టైలర్స్ సహకార సంఘం అధ్యక్షుడు గంగుల త్రిమూర్తులు ప్రభుత్వం టైలర్లను గుర్తించి వారికి రాయితీలు కల్పించాలన్నారు. పాఠశాల విద్యార్థులకు యూనిఫాం కుట్టే ఉపాధిని టైలర్లకు కల్పించి ఆదుకోవాలన్నారు. ఈ సందర్భంగా కుట్టుమిషన్ రూపకర్త హావే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వెంకటేశ్వరావు, నాని, జానీ, రాణి, మల్లికార్జునరావు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: ప్రపంచ టైలర్స్ డే వేడుకలను శుక్రవారం నెల్లిపాకలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కుట్టుమిషన్ రూపకర్త విలియమ్స్‌హావే చిత్రపటానికి టైలర్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల టైలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు హిమామ్ మాట్లాడుతూ రెడీమెడ్ రంగంతో టైలర్ల జీవనం ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి టైలర్లను ఆదుకోవాలని కోరారు. రమేష్, వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్, లక్ష్మి, సౌజన్య, సలీమా, రమాదేవి పాల్గొన్నారు.